క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి: కేతేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మారగోని పున్నయ్య భార్య ముత్తమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం కేతేపల్లికి చేరుకుని ముత్తమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, అల్లి అంజన్‌కుమార్, మట్టి సాల్మన్, ఎ.వీరాచారి, బి.రవి, జటంగి సైదులు, సీహెచ్.ఆంద్రయ్య, ఎం.పరుషయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

టీఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ నాగిళ్ల మురళికి సన్మానం



మురళిని సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: టీఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ నాగిళ్ల మురళిని ఆదివారం చాకలి ఐలమ్మ సంక్షేమ భవన్‌లో రజక సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి కష్టపడిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆకునూరు లక్ష్మీ, బీమనపల్లి దుర్గయ్య, దశరథ, సత్యనారాయణ, సైదులు, శ్రీనివాస్, విజయ్, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి రుద్రయాగం

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణు గోపాలస్వామి దేవాలయంలో నేటి నుంచి 21వ తేదీ వరకు సుదర్శన యాగసహిత రుద్ర యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరుడు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో యాగ సహిత రుద్రయాగం ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగునట్లు తెలిపారు. 21న పూర్ణాహుతి కార్యక్రమంలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్, మునుగోడు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

గంజాయిని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మునుగోడు: గంజాయి, కొకేన్‌లని పూర్తిగా అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా గంజాయి లభిస్తుండటంతో 14 ఏండ్ల నుంచి 40 ఏండ్ల వరకు యువకులు, ఇతరులు గంజాయి తాగి అనేక చట్ట వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ పార్టీ నాయకులు ఎండీ జానీ, దుబ్బ వెంకన్న, రేవెల్లి అంజయ్య, పాలకూరి యాదయ్య, దుబ్బ సైదులు, పాలకూరి యాదయ్య, దుబ్బ సైదులు. మునుగోటి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో టెక్నో తలాన్ పరీక్ష

నల్లగొండ రూరల్: గౌహతి ఐఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని వివిధ పాఠశాలల్లో టెక్నో తలాన్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు రాశారు. గౌహతి ఐఐటి విద్యార్థులు ఇలాంటి టాలెంట్ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పరీక్షల్లో నిర్వాహకులు ప్రవీణ్, నాగార్జున పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీలోని 10 వార్డు కౌన్సిలర్ చెవుగోని అఖిల లక్ష్మణ్ గౌడ్ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు.

ఫలితం ఇవ్వని బడి బాట

- ప్రభుత్వ పాఠశాలల్లో గతం కంటే తగ్గిన విద్యార్థుల సంఖ్య
- సౌకర్యాల లేమితో గురుకుల పాఠశాలల వైపు విద్యార్థుల ఆసక్తి

మునుగోడు: రోజు రోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యని పెంచేందుకు విద్యా శాఖ అధికారులు ప్రతి ఏటా జూన్ మాసంలో బడి బాట నిర్వహిస్తుంది. అలా మునుగోడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ప్రజా ప్రతినిధులు 10 రోజుల పాటు బడిబాట నిర్వహించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పొయింది. బడిబాటతో గత ఏడాది విద్యా సంవత్సరం కంటే అధికంగా విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఉన్న సంఖ్య కూడా తగ్గిపోయింది. దీంతో మండలంలో బడిబాట నిర్వహించినా ఏలాంటి ప్రయోజనం లేకుండా పొయింది.

130 మంది విద్యార్థుల తగ్గుదల

మండల వ్యాప్తంగా 42 పాఠశాలలు ఉన్నాయి.



మునుగోడు: పులిపలుపుల గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

అందులో 31 ప్రాథమిక, 7 ఉన్నత, 4 ప్రాథమిక ఉన్నత పాఠశాలు ఉండగా అందులో మొత్తం 2790 మంది విద్యను అభ్యసించారు. ఈ ఏడాది ఆయా పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పది రోజుల పాటు బడిబాట చేపట్టి విద్యార్థుల తల్లితండ్రులని చైతన్యం చేసినప్పటికీ 130 మంది విద్యార్థుల తగ్గడంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 2620కి చేరింది. అంతే కాకుండా ఒక్కరు కూడా లేని రెండు పాఠశాలలైన బీరెల్లిగూడెం, సాలిపురం పాఠశాలలను మూసివేశారు.

ఏడు పాఠశాలల్లో 10 మందిలోపు విద్యార్థులు...

మండలంలో ఈ ఏడాది మొత్తం 40 పాఠశాలలు కొనసాగుతుండగా అందులో మొత్తం 2620 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే అందులో 7 పాఠశాలల్లో మాత్రం కేవలం 10 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. వాటిలో తుర్కగూడెం, నేరటోనిగూడెం, చల్మెడ, కిష్టాపురం ఎస్సీ కాలనీ, గంగొరిగూడెం, జక్కలవారిగూడెం ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. కేవలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనే కాస్త విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. అందులో మునుగోడు ఉన్నత పాఠశాలల్లో 345 మంది, పలివెలలో 290, కొంపల్లిలో 220 మంది విద్యార్థుల చొప్పున ఉండగా మిగిలిన నాల్గు ఉన్నత పాఠశాలల్లో 100లోపు విద్యార్థులు ఉన్నారు. నాల్గు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా అందులో కేవలం చీకటిమామిడి గ్రామంలోని పాఠశాలల్లో 130 విద్యార్థులు ఉండగా మిగిలిన మూడు పాఠశాలల్లో 100లోపు ఉన్నారు.

సౌకర్యాలు కరువు



నేటికీ అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు లేవు. కనీసం మరుగుదొడ్లు, పక్కా తరగతి గదులు లేని కారణంగా అనేక మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఉన్నత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– చాపల విప్లవ్ ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి

గురుకుల పాఠశాలల్లో అధికంగా చేరుతున్నారు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యని అభ్యసించే విద్యార్థులు అధికంగా గురుకుల పాఠశాలల్లో చేరుతున్నారు. దీంతో మా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. గత ఏడాది ఉన్నంత సంఖ్యని చేరేందుకు ఇప్పటికి ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులని ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరుతున్నారు. దీంతో రోజుకు నల్గురు, ఐదుగురి చొప్పున చేరుతున్నారు.

– నర్సింహా, మండల విద్యా అధికారి

రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలి



పోటీని ప్రారంభిస్తున్న ఎస్ఐ విజయ భాయి

నల్లగొండ టూటౌన్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ భాయి అన్నారు. నల్లగొండ పట్టణంలోని తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం ద్వారా బాల బాలికలకు శారీర ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణ కూడా ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సన్ లైట్ తైక్వాండో అకాడమీ జిల్లా కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు మణికుమార్ రెడ్డి, సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి సమరసింహారెడ్డి, పూర్ణచందు, కరుణాకర్,మనోజ్ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పల ఊరేగింపు



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు



కప్పల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

చిట్యాల: వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ నేటికి చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు కురవటం ప్రారంభం కాలేదు. దీంతో చిట్యాల మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన పలువురు మహిళలు, చిన్నారులు ఆదివారం రోకలి బండకు కప్పల జతను బట్టలో చుట్టి ఊరేగించారు. కప్పల జతతో గ్రామంలోని ఇంటిఇంటికీ వెళ్లి వారు పాటలు పాడారు. వర్షాలు పడకపోవటంతోనే కప్పల జతతో ఊరేగింపు చేపడితే వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో పాటలు పాడుతూ ఊరేగింపు చేపట్టినట్లు పలువురు మహిళలు పేర్కొన్నారు.

కనగల్: మండల పరిధిలోని దోరేపల్లి గ్రామంలో వర్షాలు కురవాలని మహిళలు ఆదివారం బొడ్రాయికి నీటితో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు లేక వ్యవసాయ పనులు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



పెద్దవూరలో ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

పెద్దవూర : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ ఏపీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల వారిగా ఏయే పనులు చేపట్టారు. ఎంత ఖర్చు చేశారో సామాజిక తనిఖీ బృందాలు ప్రతి పనికి సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. మండలంలో ఆర్థిక సంవత్సరంలో రూ.5,96,09,629 ల పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత నెల 28వ తేదీ నుంచి నేటి వరకు మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఉపాధి హామీ పనులపై సమీక్షించినట్లు పేర్కొన్నారు. పనులు జరిగిన ప్రదేశాల్లో పనులకు సంబంధించి నేమ్ బోర్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో చేసిన పనులకు, కొలతలకు చాలా తేడాలు ఉన్నట్లు, కొలతలు వేయకుండానే చెల్లింపులు జరిపారని సభా దృష్టికి తీసుకువచ్చారు. మస్టర్ ముగిశాక కూడా చెల్లింపులు జరిపినట్లు, కొన్ని గ్రామాల్లో ఎంబీలు కాకున్నా చెల్లింపులు చేశారని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో చేపట్టే పనుల్లో పారదర్శకంగా వ్యవహరించి పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని సూచించారు.

అద్దె భవనంలో అవస్థలు

- భవనం చుట్టూ పెరిగిన కంపచెట్లు
- మరుగుదొడ్లపై లేచిపోయిన రేకులు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో పెద్దవాగు పక్కనే ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. 40 మంది విద్యార్థులకు స్నానాల గదులు లేకపోవటంతో ఆరుబయటే స్నానం చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లకు పైపులైన్ ద్వారా నీటి సౌకర్యం లేక బకెట్లలో నీటిని తీసుకొని వెళ్లేందుకు విద్యార్థులు తిప్పలు తప్పటం లేదు. వసతి గృహం ప్రహరీ చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరగటంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నేటికీ నోట్ పుస్తకాలు, బెడ్ షీట్స్, కార్‌పెట్స్, పెట్టెలు ఇవ్వకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారు. కంపచెట్లను తొలగించి మరుదుదొడ్లకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంపచెట్లను తొలగించాలి



హాస్టల్ భవనం ప్రహరీ చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరగటంతో రాత్రి పూట టాయిలెట్‌కు వెళ్లినప్పుడు భయమేస్తుంది. అధికారులు స్పందించి వెంటనే కంపచెట్లను తొలగించాలి. మరుగుదొడ్ల పై కప్పును సరిచేసి నల్లాలు ఏర్పాటు చేయాలి. నోట్‌బుక్స్, బెడ్‌షీట్స్, పెట్టెలను వెంటనే విద్యార్థులకు ఇచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అలకుంట్ల ప్రవీణ్, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, కట్టంగూర్



కట్టంగూర్ ఎస్సీ హాస్టల్ ప్రహరీ చుట్టూ పెరిగిన కంపచెట్లు



కట్టంగూర్ ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్డిపై లేచిపోయిన ఇనుపరేకులు

డీఎస్సీ వాయిదా వేయాలి

మర్రిగూడ: డీఎస్సీ పరీక్షను ప్రభుత్వం వాయిదా వేయడంతోపాటు గ్రూప్ –2,3 పోస్టుల సంఖ్యను పెంచాలని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్, కార్యదర్శి రావుల గిరిగౌడ్‌లు అన్నారు. ఆదివారం వారు స్థానికంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతున్న వారిని ప్రభుత్వం అక్రమ అరెస్ట్ చేయడం సబబుకాదన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే లక్షలాది మందితో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీరమల్ల శివగౌడ్, పంగ రాజుయాదవ్, పోకల గణేష్, అనిమల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

మర్రిగూడ : అధికారులు ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రతి గురువారం గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి చేసుకున్న దరఖాస్తులకు అధికారులు కాలయాపన చేయకుండా పరిష్కార మార్గం చూపాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు ఆన్‌లైన్‌కే పరిమితం కాకుండా దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట నీలకంఠం రాములు, ముత్తయ్య, లింగయ్య, యాదయ్య ఉన్నారు.

నీలగిరిలో పోలీసుల తనిఖీలు



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం: నల్లగొండలో పోలీసులు శనివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 14 టీమ్‌లుగా ఏర్పడిన పోలీస్ బృందం సరైన ఆధారాలు లేని వాహనాలను పట్టుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు. వంద మంది యువకులు పట్టణ శివారులో మద్యం సేవిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి మరోసారి బహిరంగప్రాంతాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో యువతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆకస్మిక తనిఖీలు చేస్తామని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న దుర్గా ప్రసాద్

రామగిరి(నల్లగొండ): ఎన్జీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఆనందం దుర్గా ప్రసాద్ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌ను ఆదివారం స్థానికంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, సెక్రటరీ రవి కుమార్, లైబ్రేరియన్‌లు శ్రీనివాస్, వాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ లు మాట్లాడుతూ.. మహిళా డిగ్రీ కళాశాల లేనందున, మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి చదవలేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించి విద్యను బలోపేతం చేయాలని కోరారు.

● ఘనంగా గోరింటాకు పండుగ







నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని శాంతినగర్, న్యూ చైతన్యపురి కాలనీ మహిళలు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం గోరింటాకు పండుగ సందడి చేశారు. మహిళలంతా ఒకే చోట చేరి గోరింటాకు దొరికే ప్రాంతాలకు వెళ్లి తెచ్చి రోట్లో నూరి గోరింటాకు చేతులకు పెట్టుకుని సందడి చేశారు.

ఘనంగా ఆషాఢమాస బోనాల మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం మర్రిగూడలోని కళ్యాణ కనకదుర్గ దేవాలయంలో ఆషాఢ మాస బోనాల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మర్రిగూడ నుంచి దేవాలయం వరకు భజన మేళతాళాలతో పోతరాజుల విన్యాసాలతో మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. శాకంబరీ దేవి అలంకరణ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెరిపోతుల సైదులు గౌడ్, కమిటీ సభ్యులు జెరిపోతుల పద్మ, శ్రీ దుర్గా, జెరిపోతుల కార్తీక్ గౌడ్, అర్చకులు పర్వతం రామ కృష్ణచార్యులు, తిరందాసు శ్రవణ్, మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సామేల్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

శాలిగౌరారం: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుమలగిరిలో జరిగిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, బండపల్లి కొమరయ్య, పాదూరి శంకర్ రెడ్డి, కట్టగూరి సురేందర్‌రెడ్డి, ఎర్ర యాదగిరి, కృష్ణ మోహన్, నరిగె నర్సింహ్మా, చింత ధనుంజయ్య, నూక కిశోర్, లోకసాని రంగారెడ్డి, బండమీది రమేశ్, రాపర్తి వెంకటేశ్, అల్లి సైదులు, బండారు మల్లయ్య, భూపతి అంజయ్య, జోగు శ్రీను, బండారు శంకర్, పాకాల సతీష్, బొడ్డు నగేశ్, పెరుమాండ్ల నరేశ్, లోడె సత్తయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఉషయ్యగౌడ్

నార్కట్‌పల్లి: పేద కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య తెలిపారు. మండలంలోని మాంద్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పంగా రాజు ఆరు రోజుల క్రితం గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన లక్ష రూపాయల నగదును ఆదివారం అతడి భార్యకు అందజేసినట్లు తెలిపారు. రాజు పిల్లల చదువుకూడా తానే చూసుకుంటానని తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డే భూపాల్‌రెడ్డి, కొమ్మరబోయిన మల్లేషం, దాసిరెడ్డి సత్యనారాయణరెడ్డి, దొండ రమేష్,గుండు నరసింహ, దామర ఉదయ్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రామలింగయ్య తదితరులు ఉన్నారు.

అవయవదానంతో మరొకరి జీవితంలో వెలుగు



మహేష్ అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మిర్యాలగూడ : మరణించిన వారి అవయవాలను దానం చేసినట్లయితే మరొకరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వాసవీ క్లబ్ ఐపీసీ మిట్టపల్లి విజయ భాస్కర్‌రావు అన్నారు. పట్టణానికి చెందిన బంటు మహేష్ ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందగా తల్లిదండ్రులు బంటు వెంకటేశ్వర్లు, మీనాక్షిలు తన కుమారుడు అవయవాలను దానం చేయడంపై వారిని ఆదివారం శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ బంటు మహేష్ అవయవాలు దానం చేయడం వల్ల అతను మరణించి జీవిస్తూనే ఉన్నారన్నారు. వాసవీక్లబ్ వి.క్షిప్తి మేరకు మహేష్ మృతిచెందిన సందర్భంలో కుటుంబసభ్యులు దుఃఖంలో ఉన్నప్పటికీ అవయవాలు దానం చేయడం గొప్ప విషయమన్నారు. అవయవదానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గిరీష్ జీవన్, మణిపాల్, సామ శ్రీనివాస్, మందాలపు శ్రీనివాస్, గట్టు వెంకటేశ్వర్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి కీడు వచ్చిందని..



వనవాసంలో గ్రామస్తులు

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని చిన్న సూరారం గ్రామ ప్రజలు ఆ గ్రామానికి కీడు వచ్చిందని భావించి గ్రామం విడిచి బయటకు వెళ్లారు. ఆదివారం ఉదయం వనవాసానికి వెళ్లిన గ్రామస్తులు సాయంత్రం తిరిగి వచ్చి బొడ్రాయికి జలాభిషేకం చేసిన అనంతరం వారి నివాసాల్లోకి వెళ్లారు.

నత్తనడకన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా అంబేద్కర్ భవన నిర్మాణ పనులు

మునుగోడు: నియోజకవర్గ కేంద్రంలో ఐదేళ్ల క్రితం చేపట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రంలో అన్ని హంగులతో కూడిన అంబేద్కర్ భవనాలను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకోసం ఒక్కోభవనానికి రూ. 1 కోటి చొప్పున నిధులు మంజూరు చేసింది. అయితే ఆ పనులను స్థానిక ఎమ్మెల్యే చేత 2019 అక్టోబర్ మాసంలో ప్రారంభించారు. కానీ నేటికీ ఆ పనులు మాత్రం పూర్తి చేయలేకపోయారు.

నిరాశలో దళితులు

భవన నిర్మాణానికి షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ నుంచి గత 2018 సంవత్సరం సెప్టెంబర్ మాసంలో రూ. కోటి రూపాయలు కేటాయించారు. ఆ నిధులతో 3 గుంటల స్థలంలో 79 ఫీట్ల పొడవు, 35 ఫీట్ల వెడల్పుతో భవన నిర్మాణం చేపట్టేందుకు 2020లో పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి నేటికీ భవన నిర్మాణం పూర్తిచేయకపోవడంతో మండలంలోని దళితులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అసంపూర్తిగా నిలిచిపోయిన పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.